

మూడు నామాలతో నిరసన

ప్రజాశక్తి-కుప్పం: ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కనీస వేతనాన్ని ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌లతో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. కుప్పం పట్టణంలో సోమవారం కార్మికులు పురపాలక కార్యాలయ ఆవరణంలో వినూత్నంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు నామాలతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అంతేకాక మునిసిపల్ కాంట్రాక్టింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పార్థిబన్, మునిసిపల్ అధ్యక్షులు గోవిందరాజులు, ఉపాధ్యక్షులు భారత్, మంజుల, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.


మూడు నామాలతో నిరసన తెలియజేస్తున్న కార్మికులు



వెంటు ఉరుస్తున్నా.. సడలని సంకల్పం

● 28వ రోజూ అంగన్వాడీల సమ్మె ● జడివానలో తడుస్తూ.. గొడుగులతో నిరసన ● కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తమ ప్రధాన డిమాండ్‌లు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 28వ రోజుకు చేరుకుంది. సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి కురుస్తున్న జడివానలోనూ అంగన్వాడీలు అకుంఠిత దీక్షతో సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే నీతిమాలిన చర్యలకు పాల్పడి ఎస్మా ప్రయోగంతో కార్మికులను అనచివేసే దోరణికి ఒడిగట్టడం దారుణమన్నారు. డిమాండ్‌లు పరిష్కరించకుంటే ఎట్టి పరిస్థితిల్లో సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఇదేవిధంగా కార్మికవర్గ ఉద్యమాలు అణచివేయటానికి 1981లో నాటి కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ చట్టం ఎస్మా (ఎసన్షియల్ సర్వీసెస్ మెయిన్టినెన్స్ యాక్ట్) దీన్ని ప్రధానంగా నీటి సరఫరా విద్యుత్ ఆసుపత్రులు తదితర రంగాలలో తప్పనిసరి అయితేనే ప్రయోగిస్తారు. గతంలో తమిళనాడు ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ దిగొచ్చి డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు ప్రేమ, ప్రభావతి, శాంతి, సుజిని, అరుణ, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


అంగన్వాడీలకు టీడీపీ మద్దతు

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ మద్దతు తెలిపారు. అంగన్వాడీలతో కలిసి దీక్ష శిబిరంలో బైటాయించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాలు వరలక్ష్మి, ముస్లిం మైనారిటీ నాయకులు జాఫర్, అత్తో భాయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గొడుగులతో నిరసన



ప్రజాశక్తి-పలమనేరు: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 28వ రోజూ పలమనేరులో జడివానలో గొడుగులతో నిరసన తెలియజేశారు. పలమనేరు ఐసిడిఎస్ ఆఫీస్ నందు సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శాంతి, భారతి, లక్ష్మీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేత

వైసీపీని ఊడ్చి గంగలో వేస్తారు : సీపీఐ నారాయణ


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి-నగరి: పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన డిమాండ్‌లను వైసీపీ ప్రభుత్వం నెరవేర్చకుంటే ఊడ్చి గంగలో వేయటం ఖాయమని సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం నగరిలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన 6వ రోజు నిరసన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజల అనారోగ్యం నుంచి కాపాడే కార్మికులు రోడ్డెక్కి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి, వేతనాలు పెంచాలని కోరితే ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో అంగన్వాడి కార్యకర్తలు 26 రోజులుగా సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా వారిపై ఎస్మా చట్టాన్ని తీసుకురావడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తన గొయ్యి తానే తవ్వుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్, రూపుకుమార్, విజయ్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, శేఖర్, సతీష్, సుబ్రహ్మణ్య, ఏసుదాసు, మురుగమ్మ, ఎల్లమ్మ, కాంచన పాల్గొన్నారు.

సర్కార్ స్పందించకుంటే సమ్మె ఆగదు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు నెరవేర్చాలని చేపట్టిన సమ్మె సోమవారంతో 6వ రోజుకు చేరుకుంది. సోమవారం జడివానలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం నాయకులు శరవణ, వెంకటేష్, జయ ప్రకాష్, లక్ష్మి, దుర్గ ప్రసాద్ పారిశుద్ధ్యం విభాగం నాయకులు వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, రమణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: సర్కార్ దిగొచ్చి తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు స్పష్టం చేశారు. సోమవారం 6వ రోజు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయుసి కార్యదర్శి మద్దెల సుబ్రహ్మణ్యం నాయకులు శ్రీనివాసులు, జాన్ ఆనంద్, రమేష్ బాబు, బాలాజీ, బాబు, వెంకటేష్, వాసు, సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.

'మా సమస్యలపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు..'


కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తమ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది. వర్షంలోనే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు దీక్షను కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు శ్రీనివాస యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు విల్వనాథం, కృష్ణమూర్తి, శరత్, దేవరాజ్, హరి, చందు, గీత, సురేఖ పాల్గొన్నారు.

విన్నపాలు.. వింత వింతలూ..!

- స్పందనకు అర్జీల వెల్లువ
- రెవెన్యూ శాఖవే అధికం
- వాటర్‌ట్యాంకర్ బిల్లులు మంజూరు చేయాలని యజమానుల ధర్నా
- తమకిచ్చిన భూమిని కబ్జాకు యత్నిస్తున్నారంటూ హిజ్రాల ఆందోళన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వివిద సమస్యలతో సోమవారం బాధితులు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో విన్నపాలు సమర్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. వివిద సమస్యలపై మొత్తం 329 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజల వద్ద నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌వో రాజశేఖర్ అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 269, జిల్లా ఉపాధి కల్పన శాఖ 5, పోలీసు శాఖ 5, డ్వామా 2, సమాచార హక్కు చట్టం 1, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ 1, జిల్లా విద్యాశాఖ2, ఎంపిడిఓ పాలసముద్రం 1, ఎంపీడీవో గుడిపాల 2, ప్రొబేషన్ అండ్ ఎక్స్‌సైజ్ శాఖ 1, ఎపిఎస్ పిడిసిఎల్ 1,ఇ ఇ పంచాయత్ రాజ్ 1, నగర పాలక సంస్థ పుంగనూరు 1, ఎంఈవో ఐరాల 1, జిల్లా పంచాయత్ 1, డిసిహెచ్ఎస్ 1, డిఎస్ఓ 17, డియంహెచ్ఓ 1, డిఎల్‌డిఓ 3, ఎఓ 2, నేషనల్ హై వే 6, సూపర్ ఇండెంట్ 3, హౌసింగ్ శాఖ 2 చొప్పున వినతులు అందినట్లు అధికారులు వివరించారు.

వాటర్‌ట్యాంకర్ బిల్లుల కోసం ఆందోళన

వాటర్ ట్యాంక్ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వీకోట మండలానికి చెందిన వాటర్ ట్యాంకర్ యజమానులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుండి వీకోట మండలంలోని 2019 నుండి 2021 ఏప్రిల్ వరకు గ్రామీణ నీటి సరఫరా పథకంలో భాగంగా టాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. ఒక ట్యాంకర్‌కు 540 ప్రభుత్వం ద్వారా చెల్లిస్తామని చెప్పారన్నారు. ట్యాంకర్లకు మంచినీరు కొని సరఫరా చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. వికోట మండలంలో దాదాపు రూ.17 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు రావలసిన వాటర్ ట్యాంక్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. వినతి చేసిన వారిలో రాధాకృష్ణారెడ్డి, ఉదయ్ కుమార్, దామోదర్, హరీష్, యువరాజ్, కమల్, అప్పి రెడ్డి , వెంకటేష్ రెడ్డి, కేఎం రామచంద్ర, భాస్కర్ రెడ్డి, హరిష్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణ మూర్తి, ఎంపిటిసి మంజు, సురేష్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రైతుల భూమిని ఆక్రమించుకున్నారని ధర్నా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తమ గ్రామంలోని రైతులు ఉపయోగించుకునే కళ్లెం భూమిని అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తుల ఆక్రమించుకున్నారంటూ వెదురుకుప్పం మండలం జక్కదన గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి కళ్లెం భూమి రైతులందరికీ ఉపయోగపడేలా ఉండేదని, ఈ భూమిని తమ గ్రామంలోని అగ్రకులాలకు చెందిన కొందరు ఆక్రమించుకొని కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రెవెన్యూ అధికారులను ఆశ్రయించిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు కల్పించుకొని తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

మాకిచ్చిన స్థలాన్ని వదలట్లేదు : హిజ్రాలు


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న హిజ్రాలు

ఇళ్ల స్థలాల కోసం అనేక దఫాలుగా పోరాటాల తర్వాత స్థానిక ప్రశాంత్ నగర్‌లో కేటాయించిన ఇండ్ల స్థలాలను కొందరు అక్రమార్కులు కాజేయాలని చూస్తున్నారంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట చిత్తూరు, తిరుపతికి చెందిన హిజ్రాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న తమకు ప్రశాంత్ నగర్‌లో ఇళ్ల స్థలాలు, కమ్యూనిటీ భవన్ కోసం స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఇటీవల ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారని అడ్డుకున్న తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



ధర్నా చేస్తున్న జక్కదొన గ్రామస్తులు


ధర్నాచేస్తున్న వాటర్‌ట్యాంకర్ యజమానులు

పారిశుద్ధ్యం లోపించకూడదు..

- ప్రత్యామ్నాయ పరిశుభ్రత పనులు చేపట్టాలి
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదు
- సిబ్బందికి కమిషనర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరంలో పారిశుద్ధ్యం లోపించడానికి వీల్లేదని కమిషనర్ డాక్టర్ జె.అరుణ సిబ్బందికి సూచించారు. డిమాండ్‌లపై కార్మికులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో సాధారణ ప్రజలకు ఎట్టి పరిస్థితిల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించారు. కొంగారెడ్డిపల్లి, చర్చి వీధిలోని కూరగాయల మార్కెట్లు, ఫిష్ మార్కెట్లను తనిఖీ చేశారు. స్థానిక దుకాణదారులతో మాట్లాడారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో దుకాణదారులు, వ్యాపారస్తులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. వ్యర్థాలను ఇష్టారాజ్యాంగా పడేయకుండా చెత్త తరలించే వాహనాలకు అందించాలన్నారు. మార్కెట్ల వద్ద, ప్రధాన సర్కిల్స్, రద్దీ ప్రాంతాల్లో రోజూ చెత్తను తరలించాలన్నారు. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని సమకూర్చుకొని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. ఎక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేసే హోటల్స్, మాల్స్, ఇతర సంస్థలను సమన్వయం చేసుకొని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.


పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న నగర కమిషనర్

వర్షాల నేపథ్యంలో ఎక్కడ డ్రైనేజీ బ్లాక్ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

వినతులపై తక్షణ 'స్పందన'

ప్రజల నుంచి అందిన స్పందన అర్జీలకు స్పష్టమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆమె వినతులు స్వీకరించారు. కాగా వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను పురమాయించారు. ఇంజనీరింగ్ విభాగం-4, పట్టణ ప్రణాళిక విభాగం-1 చొప్పున 5అర్జీలు అందినట్లు తెలిపారు.

టిటిడి ఉద్యోగులందరికీ ఇళ్లపట్టాలు




రెండో విడత పంపిణీలో భూమన కరుణాకరరెడ్డి
మిగిలినవారికి ఏర్పేడు వద్ద 450 ఎకరాలు సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశంలో ఏ ప్రభుత్వ ఉద్యోగికీ లేనివిధంగా అతి తక్కువ ధరకు ఉద్యోగులందరికీ ఇళ్లపట్టాలు ఇచ్చిన ఘనత టీటీడీకే దక్కుతుందని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలియజేశారు. ఉద్యోగులకు తన చేతులమీదుగా ఇంటిపట్టాల పంపిణీ జరగడం తన అదృష్టమన్నారు. టీటీడీ ఉద్యోగులకు రెండో విడత ఇంటి పట్టాల పంపిణీ పండుగ కార్యక్రమం సోమవారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ 17 సంవత్సరాల క్రితం తాను టీటీడీ చైర్మన్ గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్లు చెప్పారు. తన ఒత్తిడి వల్లే ఉద్యోగులకు ఇంటిస్థలాలు మంజూరు చేసినట్టు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇదే వేదిక మీద తెలియజేశారని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించే విషయం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఆయన ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమాన్ని సాకారం చేయడంలో ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర కార్యనిర్వాహకవర్గం తనకు చేదోడు వాదోడుగా ఉండి ముందుకు నడిపించారని అభినందించారు. మూడో విడతగా రిటైర్డ్ ఉద్యోగులకు, మిగిలిన ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం ఏర్పేడు మండలం పాగాలి వద్ద 350 ఎకరాల భూమిని టిటిడికి ఇవ్వడంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఇందుకోసం ధర్మకర్తల మండలిలో 87 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరుచేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఏర్పేడు వద్ద ఈ నెలాఖరు లోపు 450 ఎకరాలను ప్రభుత్వం నుండి స్వాధీనం చేసుకుని మూడో విడతలో రిటైర్డ్ ఉద్యోగులకు, ఉద్యోగులకు అందిస్తామన్నారు. త్వరలోనే 4 వేల మందికి పైగా ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంటిస్థలాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేతులమీదుగా ఉద్యోగులకు ఇంటిస్థలం పత్రాలను మొత్తం 1703 మందికి రెండో విడతలో ఇంటిస్థలాలు పంపిణీ చేశారు. జేఈవో సదా భార్గవి, సివిఎస్ఓ నరసింహ కిషోర్, డిఎల్వో వీర్రాజు, సిఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అసైన్మెంట్ భూముల ప్రక్రియను పూర్తి చేయాలి : జేసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈనెల 22న ఎస్ఎస్ఆర్ విడుదల చేయనున్నందున ఈనెల12 లోపల డిసెంబర్9 నాటికి వచ్చిన క్లైమ్లను పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు గురించి సమావేశం నిర్వహించనున్నారని, అసైన్మెంట్ భూములకు సంబంధించి ఆన్లైన్ నమోదు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి, మున్సిపల్ కమిషనర్లు ఆర్డీవోలు, తహశీల్దార్‌లు, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిసెంబర్9 నాటికి వచ్చిన వివిధ క్లైములు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్లోడ్ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల వారు ఇప్పటికే పరిశీలించడం జరిగిందని దీనికి సంబంధించి విస్తృతస్థాయి సమావేశం జిల్లా స్థాయిలో ఈనెల 11న నిర్వహించనున్నారని ఎన్నికలకు సంబంధించిన వారందరూ హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కేంద్రాలలో ఏర్పాట్లను మరోసారి పరిశీలించుకోవాలని అన్నారు. ఇంకా కొన్ని మండలాలలో అసైన్మెంట్ భూములకు సంబంధించి ఈ కేవైసీ పెండింగ్ లో ఉందని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చెన్నయ్య, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారి శివయ్య, ఆర్డిఓలు సృజన, మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులతో పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రను పకడ్బందీగా నిర్వహించండి: జేసీ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జన భాగీదరి కార్యక్రమంను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కార్యక్రమ నిర్వహణ సంబంధించిన ఫోటోలను వివరాలను సంబంధిత వెబ్సైట్ నందు అప్లోడ్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాసచివాలయం లోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం ఆర్‌డిఓలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో "జన భాగీదరి" కార్యక్రమం నిర్వహణ, ఆడుదాం ఆంధ్ర, వికసిత భారత్ సంకల్పయాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నిమిత్తం ఈనెల 9,10వ తేదీల్లో జడ్పీ సమావేశపు మందిరంలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.

అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు


జిడి నెల్లూరులో


నగరిలో


పెద్దపంజాణిలో

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి పొంగళ్ళుపెట్టి సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గంగాధరం, రెడ్డెమ్మ, ఎస్ఎంసి ఛైర్మన్ రేవతి, సహిత విద్య ఉపాధ్యాయులు వరదారెడ్డి పాల్గొన్నారు.

నగరి: మండలంలోని రామాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని పల్లుణ మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజేయడం ఉపాధ్యాయులుగా మా బాధ్యత అని తెలిపారు. భారతదేశ సంస్కృతి , సంప్రదాయాలు ఒకతరం నుండి మరొక తరానికి బదలాయింపు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. ప్రస్తుతం విద్యార్థిలోకం సాంకేతికతను ఉపయోగించుకుని సామాజిక మాధ్యమాలకే పరిమితమవుతుండడం ఆందోళన కలిగించే విషయమని వాపోయారు. ఇలాంటి పండుగలు జరపడం వల్ల విద్యార్థులలో ఐకమత్యం, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం, సమాజంలోని వివిధ రకాల మనస్తత్వాలు కలిగిన మనుషులతో కలసిమెలసి ఎలా మెలగాలనే విషయాలు అలవరచవచ్చని తెలిపారు. అనంతరం ఉత్సవాలలో భాగంగా భోగిమంటలు వేయడం, గొబ్బిళ్ళు పాటలు పాడించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాబురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పురాతన సంస్కృతీ సంప్రదాయాలు కట్టు, బొట్టు పండుగ చేసుకునే విధానాలు అన్నింటిని భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. మన తెలుగు జాతి మనుగడ కలకాలం కొనసాగాలంటే మన సంస్కృతీ సంప్రదాయాలు పట్టుకొమ్మలుగా విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు వేషంలో వచ్చి చూపరులను చాలా బాగా ఆకట్టుకున్నారు. అమ్మాయిలు గొబ్బెమ్మను ఉంచి గొబ్బి పాటలు పాడారు. విద్యార్థులందరూ రంగవల్లులు, సాంస్కృతిక ప్రదర్శనలతో చక్కగా అలరించారు. పాఠశాల ముందు భాగంలో భోగి మంటలు వేసి చీడపీడలు చెడు భావనలు అన్ని భోగిమంటల్లో కాలిపోయి కొత్త ఆలోచనలు నూతన ఒరవడిని సృష్టించేలా విద్యార్థులందరూ చక్కగా చదవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, మాధవన్,ఆంజప్ప, రాజేష్ బాబు, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలి

- వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్


క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి-యాదమరి: ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రమైన యాదమరిలో ఉన్న లక్ష్మీ ఆర్ఎంపి క్లినిక్‌ను డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాదమరిలో ఉన్న ఆర్ఎంపి క్లినిక్‌లలో ఫస్ట్ ఎయిడ్ కాకుండా వారి ఇష్టానుసారంగా వైద్య చికిత్సలు అందిస్తున్నారని దానివలన ప్రజలకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ తప్ప మిగిలిన వారు సూది మందులు ఇవ్వడం ల్యాబ్ టెస్టులు చేయడం, ఎక్సరే తీయడం చేస్తున్నారని ఇలాంటివి చేస్తే నేరం అన్నారు. లక్ష్మీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఇకపై సూది మందులు ఇవ్వడం లాంటివి చేయరాదని అలా చేసినట్టు తమ దృష్టికి వస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

తెరణిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-నగరి: కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన ఏర్పరచడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర సోమవారం తెరణి సచివాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో లీలామాధవి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వాటిని పొందడానికి ఉన్న అర్హతలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల డింపుల్, ఎంపీటీసీ యేసు, ప్రకృతి వ్యవసాయ ఎంటీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన సజావుగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రామకుప్పం: పంచాయతీ బూత్ కన్వీనర్లు, కోఆర్డినేటర్లు ఓటరు పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పంద్యాల మడుగు, 89 పెద్దూరు పంచాయతీలో పర్యటించి అర్హులైన ఓటర్లను పరిశీలన చేసి సమగ్రంగా నివేదికలు తయారు చేయాలన్నారు. అదేవిధంగా 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి నరసింహులు, క్లిస్టర్ ఇంచార్జ్ రఫీ, యూనిట్ ఇంచార్జ్ గజేంద్ర, మాజీ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ అధ్యక్షుడు లోకేష్, చంద్రారెడ్డి, గంట్లప్ప గౌడు, అప్పాలా పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.1.10లక్షల ఆదాయం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట పంచాయతీలోని చేపల చెరువులకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు సర్పంచ్ దివ్య, కార్యదర్శి లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలోని అన్నూరుచెరువు (తుమ్మలచెరువు) వేలం పాట ద్వారా రూ.70వేల 500లు, పెద్ద కమ్మచెరువు వేలం పాట ద్వారా రూ.41 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు. చేపల చెరువు వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం కత్తెరపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రోజుకు ఎన్ని ఓపిలు వస్తుంది అన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. త్వరలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి పని తీరుపై సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ పురంధర్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే :ఎంపీపీ



ప్రజాశక్తి-కార్వేటినగరం: హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మపల్లి సచివాలయం పరిధిలో క్రిష్ణాపురం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దనశేఖర్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య ఎంపీపీ లతబాలాజీ పాల్గొని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు రూ.3వేల పింఛన్ తోపాటు, ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఎంపీటీసీ మురగయ్య, ఎంపీడీవో మోహన్ మురళీ,ఈఓఆర్డీ లక్ష్మిపతి, కార్యదర్శి వాణి, సచివాలయ సిబ్బంది. లబ్దిదారులు పలువురు పాల్గొన్నారు.

బంగారుపాలెం: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెంచిన రూ.3వేల పింఛన్‌లను అందజేశారు. సర్పంచ్ దీప్తిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్, గ్రామస్తులు బాలాజీ, గిడ్డు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరు నాత్తం గ్రామపంచాయతీ సర్పంచ్ రోజాశివశంకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ఆచారి, వైస్ సర్పంచ్ పద్మమ్మ, చిదంబరం, చంద్రశేఖర్ శెట్టి, రామన్న, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


బైరెడ్డిపలిలో

'కుప్పంకు సాగునీరు తాగునీరు అందించేది చంద్రబాబే'



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గం ప్రజలకు త్రాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించడం చంద్రబాబు వల్ల మాత్రమే సాధ్యమని కుప్పం నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని టిడిపి కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కుప్పం నియోజకవర్గం పరిధిలో ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయమే జీవనోపాధిగా కలిగిన రైతులను ఆదుకోవడానికి గతంలో టీడీపీ హంద్రీనీవా ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హంద్రీనీవా 90 శాతం పనులు పూర్తిచేసుకుని దాదాపు ముగింపు దశకు చేరుకుందని తెలిపారు. దురదృష్టవశాత్తు 2019లో టిడిపి అధికారం కోల్పోవడం, వైసిపి అధికారం చేపట్టడం జరిగిందన్నారు. అప్పటినుండి అధికార ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం ప్రాంతం గురించి మాట్లాడిన ప్రతిసారి హంద్రీనీవాను పూర్తి చేసి ప్రజలకు సాగునీరు అందిస్తామని నమ్మ పలుకుతున్నట్లు ఆరోపించారు. వైసిపి అధికారం చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్న 10శాతం పనులు పూర్తి చేయలేకపోయారని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడేసరికి హంద్రీనీవా ఈ మాసంలోనే ప్రారంభిస్తామని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. 2024లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చి తీరుతుందని, తర్వాత కుప్పం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా టీడీపీ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే హంద్రీనీవా పనులను పూర్తి చేసి నియోజకవర్గ రైతులకు సాగునీరు, ప్రజలకు త్రాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల చేతివాటం

• బాధితులకు అందని సాయం • రోడ్డు ఎక్కిన తుపాను బాధితులు

ప్రజాశక్తి- నాయుడుపేట: మీచౌంగ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు జనజీవనం అతలాకుతలమైన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వాలు స్పందించాయి. బాధితులకు తక్షణ సహాయార్థం ఉచిత బియ్యాన్ని, నిత్యావసర సరుకులను, ప్రతి ఇంటికీ రెండువేల రూపాయలు నగదును పంపిణీ చేసింది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. కానీ ఇక్కడే అధికారులు స్థానిక నాయకులతో కలిసి చేతివాటం ప్రదర్శించారు. పేదలకు పంచే బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు విషయంలోనూ అధికారులు చేతివాటం ప్రదర్శించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంత మందికి వెయ్యి రూపాయలు, మరి కొంత మందికి రూ.500, ఇంకొందరికి పూర్తిగా ఎలాంటి సాయం అందలేదని సహాయం అందని బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ 2,500 రూపాయలు చొప్పున ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.


ఆందోళన నిర్వహిస్తున్న తుపాను బాధితులు

తుపాను వచ్చి అన్ని ఊడ్చేసి

నెలకావస్తున్నా ఇప్పటికీ కొంతమంది బాధితులకు సహాయం అందక గగ్గోలు పెడుతున్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట లోని లోతువాణిగుంట ప్రాంతంలో సుమారు 100 కుటుంబాలు సోమవారం ఉదయం వరద సాయం అందలేదంటూ రోడ్డు ఎక్కాయి. వరదలో మునిగిపోయిన లోతట్టు ప్రాంతాలను వదిలేసి అధికారులు మెట్ట ప్రాంతాలలో వరద సహాయం అందించారని 'మేమేం పాపం చేశాము?' అంటూ బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసనను తెలిపారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

అందరికీ అందాల్సిన వరద సాయం కొందరికి అందకుండా అధికారులు నొక్కేశారని బాధితులు చెప్తున్నారు. ఒక్క లోతువాణిగుంటే కాకుండా నాయుడు పేట లోని తుపాన్ వల్ల దెబ్బతిన్న ఎస్‌టి, ఎస్‌సి కాలనీలకు ప్రభుత్వ సాయం అందించాలని సూచించిన రెవెన్యూ అధికారుల హడావుడి తప్ప బాధితులకు ఎలాంటి సాయం అందలేదు. ఎల్‌ఏసాగరంలోని ఎస్సీ కాలనీలో కొంత మందికి మాత్రం ఇచ్చి మరి కొంత మందికి ఇవ్వకపోవడం, 'మీకు తర్వాత వస్తాయి..' అని తప్పించుకునే మాటలు చెప్పడం విశేషం. అధికారులు, నాయకులు కలిసి ఇలాంటి ఘనకార్యాలు నిర్వహించారనడంలో ఎలాంటి సందేహం లేదు. వైసీపీ నాయకుల సమక్షంలోనే ఒక కాలనీలో సగం మందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి ఇవ్వక పోవడంలో ఆంతర్యం ఏమిటి? అన్నది తెలియాల్సి ఉంది. బాధితుల విషయంలో అధికారులు ఎలాంటి నియమాలు పాటించి సహాయం అందించారు. రెవెన్యూ అధికారులు ఈ విషయంలో ఎవ్వరికీ సమాధానం చెప్పకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా అధికారులు స్పందించి బాధితులకు సహాయం అందించాల్సిన అవసరం ఉంది. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలోనే నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫొటోలకు ఫోజులిస్తూ ప్రతిరోజూ సోషల్ మీడియాలో కనిపించిన నాయకులు ఇవేవీ తెలియనట్లు ఆశ్చర్యం వ్యక్త పరచడం హాస్యాస్పదం. ప్రభుత్వం అందించిన సహాయాన్ని పూర్తిగా ప్రజలకు అందకపోయినా ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం.


బాధితుల ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసులు

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో డిబేట్ పోటీ

ప్రజాశక్తి - క్యాంపస్ :

విజయవాడలో 125 అడుగుల ఎత్తు కలిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా స్థానిక పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం డిబేట్ పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, డీన్ స్కూల్ ఎఫైర్స్ సంయుక్తంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులకు డిబేట్ కాంపిటీషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ప్రొఫెసర్ జె. కాత్యాయని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం విద్యావతి, జడ్జిగా డాక్టర్ టి శిరీష, విద్యా విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 5 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా విభాగం ఎస్‌జి శంషాద్‌కి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్:

శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం విద్యా విభాగం పరిశోధన విద్యార్థిని షేక్ గౌశల్ శంషాద్ కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వ విద్యాలయం విద్యా విభాగం ఆచార్యులు మన్నా అనూరాధ మార్గదర్శకత్వంలో 'ఎ స్టడీ ఆఫ్ నైన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఇంగ్లీష్ అచీవ్‌మెంట్ ఇన్ రిలేషన్ టు సైకో సోషల్ వేరియబుల్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం యూనివర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్సిటీ డీన్ ఎగ్జామినేషన్ తెలిపారు. శంషాద్‌కి డాక్టరేట్ లభించడంపై రీసెర్చ్ సూపరువైజర్, విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థినులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నారాయణవనం:

మండలంలోని అరణ్యకండ్రిగ సచి వాలయ నూతన భవనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని ఇంకా అభివృద్ధి చెందేలా ప్రజలను నడిపించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, సర్పంచ్ సాయి రవి, చైర్మన్ సుబ్రహ్మణ్యం యాదవ్, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పిచ్చాటూరు:

'వర్డ్' ప్రకృతి వ్యవసాయ వెంగళతూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, వర్డ్ కార్యదర్శి డాక్టర్ గంగాధరం, ఉపాధ్యాయులు హరి ప్రసాదు, దినకర బాబు, డాక్టర్ పాండురంగ శెట్టి, తులసీరామ్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

టెన్నిస్ విన్నర్‌గా 82 ఏళ్ల మాజీ డీఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

విక్రమ్ స్పోర్ట్స్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీల్లో 82 ఏళ్ల మాజీ ఆర్టీసీ డిపో మేనేజర్ విజేతగా నిలిచారు. 70 ప్లస్ డబుల్స్ విభాగంలో పోటీపడ్డ శ్రీకాళహస్తి ఆర్టీసీ మాజీ డిపో మేనేజర్ సాయి రాం బాబు ఏకంగా విజేతగా నిలిచారు. సోమవారం ఆయనకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ట్రోఫీని జ్ఞాపికను అందజేశారు. నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, మాజీ సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -కోట : రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కోట– గూడూరు రోడ్డులో నగదు, లిక్కర్ తదితర అక్రమ రవాణాను నిరోధించేందుకు కోట ఎస్ఐ పి నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం విద్యానగర్ నుండి గూడూరుకు వెళ్లే రోడ్డుపై వాహనాలను తనిఖీ చేసే ఏర్పాట్లను ప్రారంభించామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఎవరైనా అక్రమంగా నగదు, లిక్కర్, తదితరాలను రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట పోలీసు సిబ్బంది కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక చెక్‌పోస్టు ఆవరణలో బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహ తమ సిబ్బందితో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ముందస్తు ఇతర రాష్ట్రాల నుండి మద్యం, నగదును తీసుకునే వారు ఎవరైనా ఉంటే వారిని అదుపు లోకి తీసుకుని ఆ మద్యం, నగదును ప్రభుత్వానికి అప్పగించేందుకు పోలీస్ సిబ్బంది ముందస్తు వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఎంతో మంది ఎన్నికలకు సంబంధించి ముందస్తు మద్యం, నగదును నిల్వ చేసుకుంటుండటం దృష్టిలో వుంచుకుని ప్రతిరోజు చెక్ పోస్ట్ దగ్గర అనేక చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా పట్టుబడితే వారిపై నేరుగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం దివాలా

- మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో మన రాష్ట్రం అప్పుల్లో దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలిచిందని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆరోపించారు. గూడూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, చెంచు రామయ్య , వెంకటేశ్వర్లు రాజు , రహీం పాల్గొన్నారు.

వేడుకగా విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల వార్షికోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు విద్యుత్ డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం 13వ వార్షికోత్సవం సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి డిస్కం విశ్రాంత ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు కే ఎస్ ఎన్ చారి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల హక్కు కోసం సంఘం పోరాడుతోందన్నారు. అనంతరం 70 ఏళ్లు దాటిన 9 మంది ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వేణుగోపాల్ అయర్, పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి భాస్కర్, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు భాస్కర్ రాజులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలు నేటి 9వ తేదీ నుండి మంగళవారం నుండి జనవరి 18 వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అధికారులు పేర్కొన్నారు. సెలవుల్లో పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులను ఏ చెరువుల వద్దకు, గుంటల దగ్గరకు పంపకుండా ఇంటిలో కూర్చోబెట్టి వారిని చదివించి నిఘా వేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. విద్యార్థులకు బైకులు అలవాటు చేసి వాటిపై విద్యార్థులు వీరవిహారం చేయడం, అది వారికి, వారి కుటుంబానికి నష్టం కలుగుతుందని ఈ సంక్రాంతి సెలవులకు విద్యార్థు లకు ఎలాంటి బైకులు ఇవ్వకుండా ఇంటి వద్దనే క్రమ శిక్షణతో వారిని కాపాడు కోవాలని తెలిపారు.